క్లుప్తంగా

నేటి నుంచి జగనన్న సురక్ష

నాగులుప్పలపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య రక్షణకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడత శుక్రవారం మండల వ్యాప్తంగా ప్రారంభించనున్నారు. మెదటి రోజు కొత్తకోట గ్రామ సచివాలయ పరిధిలో ఈ మెడికల్ క్యాంపు ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో జయమణి తెలిపారు.

పేస్‌లో మెగా రక్తదాన శిబిరం



పేస్‌లో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రభుత్వ సర్వజనీన వైద్యశాల బ్లడ్ బ్యాంక్, పేస్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం ఆవశ్యకత గురించి కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ వివరించారు. ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సామాజిక బాధ్యతను గుర్తించి రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు, ఏవో ఎం,రమణబాబు, తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రేపు సామాజిక పెన్షన్ల పంపిణీ సభ

నాగులుప్పలపాడు: వైఎస్సార్ పెన్షన్ కానుక శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున చేతుల మీదగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జయమణి తెలిపారు. నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.


ఘనంగా ధనుర్మాస పూజలు

నాగులుప్పలపాడు: ధనుర్మాసం సందర్భంగా ఉప్పుగుండూరులో వేంచేసిన ఆళ్వారాజుల రుక్మిణీ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ పూజారి దివి శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు చేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కొంజేటి సురేష్, రోహిణి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం ప్రసాదం అందజేశారు.

జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపిక రేపు

చీమకుర్తి: ప్రకాశం జిల్లా స్థాయి జూనియర్ హాకీ జట్టును ఈనెల 6న ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూలులో ఎంపిక చేయనున్నట్లు హాకీ కోచ్ రవికుమార్ చీమకుర్తిలో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9,10,11,12 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు. ఎంపికలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

జ్ఞానమే భక్తికి సోపానం



తిరుప్పావై ప్రవచనం చేస్తున్న నేమ్మాని సీతారామూర్తి

ఒంగోలు మెట్రో: సంతపేట షిరిడీ సాయి మందిరంలో వెలసిన వెంకటేశ్వర స్వామి సన్నిధిలో తిరుప్పావై మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఉపన్యాసకులు నెమ్మాని సీతారామమూర్తి గురువారం 19వ పాశుర ప్రాధాన్యం వివరించారు. అర్థ పంచక జ్ఞానం గురించి తెలిపారు. భక్తి జ్ఞానానికి సిద్ధాంజనం లాంటిది అని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షుడు అళహరి చెంచలరావు, భక్త బృంద ప్రతినిధి దామచర్ల లక్ష్మీ ప్రసన్నకుమారి, ప్రధాన అర్చకులు

పూలే జీవితం ఆదర్శనీయం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ హర్ష

ఒంగోలు సెంట్రల్: తొలి మహిళా ఉపాధ్యాయురాలు, నిమ్న వర్గాల చదువు హక్కు కోసం ప్రజల పక్షాన తన జీవిత చరమాంకం నిలబడి పోరాడిన సావిత్రి బాయి పూలే ఆదర్శనీయమని వక్తలు అన్నారు. ఒంగోలు ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గురువారం పూలేకు నివాళులర్పించారు. జై భీం సంస్థ అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన సభను నిర్వహించారు. ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయ సోషల్ వర్క్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హర్ష ప్రీతం దేవకుమార్ పూలే జీవితాన్ని, సాధించిన విజయాలను వివరించారు. వసతి గృహ సంక్షేమ అధికారి స్వప్నలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

● మేయర్ గంగాడ సుజాత



మాట్లాడుతన్న కమిషనర్ వెంకటేశ్వరరావు, వేదికపై మేయర్ సుజాత తదితరులు

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, అన్ని వర్గాల ప్రజల సుఖ సంతోషాలతో ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. గురువారం నగరంలోని బాలాజీ నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోతురాజు పాలెంలోని బాలాజీ నగర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మాట్లాడారు. చంద్రబాబులా తాత్కాలిక పథకాలతో ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేయడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేయదన్నారు. నిరుపేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య శ్రీ పథకం, పేద మధ్య తరగతి వర్గాల బిడ్డలు ఇంగ్లిషు మీడియంలో చదవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టడం, అద్దె ఇంటితో ప్రజలు ఇబ్బందులు పడకూడదంటూ జగనన్న ఇళ్లు నిర్మించి ఇవ్వడం వంటి పథకాల గురించి వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దేశంలో ఎక్కడా అమలు చేయడం లేదని, పేద ప్రజలకు ఇంటి వద్దకే మందులు తెచ్చి ఇవ్వడం కేవలం మన ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అమలు చేస్తున్నారని చెప్పారు. ఇంటి పెద్ద కొడుకులా జగనన్న ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు సేవలను అందిస్తున్నారని, అవసరమైన పరీక్షలను పూర్తిగా ఉచితంగా చేస్తామని తెలిపారు. ప్రజలంతా కులమతాలకతీతంగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం మొదటి విడత చాలా మంది ప్రజలు ఉపయోగించుకున్నారని కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. వేల రూపాయల విలువ చేసే రోగ నిర్ధారణ పరీక్షలు, బీపీ, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. కంటి పరీక్షలు చేయడమే కాకుండా అవసరమైన వారికి కంటి అద్దాలు, శుక్లం ఉన్న వారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఆర్థోపెడిక్ జాగర్లమూడి ప్రకాష్, జనరల సర్జన్ డా.రాకేష్ సేవలను అందించారు. నోడల్ అధికారి డాక్టర్ సరళా దేవి, డీసీహెచ్ఎస్ డా.మూర్తి వైద్య శిబిరంలో అందించనున్న వైద్య సేవలను వివరించారు. డీపీఎంఓ వాణిశ్రీ, కార్పొరేటర్ నాగభూషణం, ఎంహెచ్ఓ మనోహర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ గోరుముద్ద అందాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: ప్రతి విద్యార్థికీ జగనన్న గోరుముద్ద అందేలా చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గంగాడ సుజాత ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం నగరంలోని వెంగముక్కలపాలెం మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారని అడగగా బాగానే చెబుతున్నారని పిల్లలు జవాబు ఇచ్చారు. జగనన్న గోరు ముద్ద ఇస్తున్నారా, షూస్, యూనిఫాం, బెల్టు అందరికీ అందాయా లేదా అని వాకబు చేశారు. అనంతర మేయర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర



ఇనమనమెళ్లూరులో బహుమతులు అందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, సర్పంచ్ ఏకుల ఏడుకొండలు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి, తెల్లబాడు, ఇనమనమెళ్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ప్రతి మైదానానికి ఆరు సచివాలయాలను కేటాయించగా ప్రతి సచివాలయం నుంచి పురుషుల, మహిళల జట్లు క్రికెట్ ఆడుతున్నాయి. మండల స్థాయిలో పోటీలను నిర్వహించడానికి 4 చోట్ల మైదానాలు సిద్ధం చేస్తున్నట్లు ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు గురువారం తెలిపారు.



కొత్తపట్నం: క్రికెట్ ప్రారంభిస్తున్న ఎంపీడీవో సుజాత

విజేతలకు బహుమతులు

మద్దిపాడు: ఆటల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇనమనమెళ్లూరు సచివాలయ పరిధిలో విజేతలకు ఎంపీపీ గురువారం బహుమతులు అందించారు. సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, సచివాలయ కార్యదర్శి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపట్నం: ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఆలూరు, గాదెపాలెం, గుండమాల, మోటుమాల, కొత్తపట్నం, కె.పల్లిపాలెం, అల్లూరు గ్రామాల్లో పూర్తి చేశారు. రెండు రోజుల నుంచి గమళ్ళపాలెం, వజ్జిరెడ్డిపాలెంలో జరుగుతున్నాయి. గురువారం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఆటల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రికెట్ పోటీలను సుజాత ప్రారంభించారు. ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి వంశి, పీఈటీలు పాల్గొన్నారు.



గుండ్లాపల్లి పాఠశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న రాచవారిపాలెం యువకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ



చీమకుర్తి: స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ, రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: విద్యార్థులకు పదోతరగతి స్టడీ మెటీరియల్‌ను చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ కె.శివాజీ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గురువారం అందించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను రోటరీక్లబ్ అధ్యక్షుడు గుండా చినవెంకటేశ్వర్లు, మన్నం నాగరాజు, టి.శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో అందించినట్లు తెలిపారు. ఎంఈఓ శివాజీ, రోటరీక్లబ్ సభ్యులు మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులను సాధించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎం జి.వీరాస్వామి రోటరీక్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రోటరీక్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండా చినవెంకటేశ్వర్లు, అంబటి వీరారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, స్థానిక హైస్కూలు టీచర్‌లు గల్లా వసంత భవానీ, జెట్ల రవికుమార్ పాల్గొన్నారు.

రామ మందిర అక్షతల పంపిణీ



అక్షతలను పంపిణీ చేస్తున్న సాయి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ఈ నెల 22న అయోధ్య రాముల వారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా, అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను గురువారం ఒంగోలు నగరంలోని సీతారాంపురంలో పంపిణీ చేశారు. అలాగే రాము–పావని దంపతులు, స్థానిక సాయి సత్సంగ మందిరం నుంచి మహిళలు అక్షతలతో పాటు గుడి చిత్రపటం, కరపత్రాలు అందించారు. ధనిశెట్టి పావని, తీగల సత్యవతి, భువనేశ్వరి, ఇంకొల్లు లక్ష్మి, ఇంకొల్లు అనురాధ, శ్రీదేవి, అమూల్య, తెనాలి ప్రసన్న, సంధ్య రాణి, శేషమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు: ఉపాధ్యాయుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావుని ఆయన చాంబరులో కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని, గత మూడు సంవత్సరాలనుంచి పెండింగ్‌లో ఉన్న స్పాట్ వాల్యుయేషన్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఒ. వీరారెడ్డి, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, షేక్ అబ్దుల్, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

100 రోజుల పని కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న రవీంద్రరెడ్డి, సుజాత, జ్యోత్స్న, అధికారులు

ఈతముక్కల (కొత్తపట్నం): ఎన్ఆర్‌జీఎస్ ద్వారా కూలీలకు ఉపాధి కల్పించాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించేందుకు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించేందుకు గ్రామ సభ నిర్వహించినట్లు చెప్పారు. పీఆర్ఏ పద్ధతిలో సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్ ద్వారా గ్రామ పనులను గుర్తించామన్నారు. 1,079 మంది జాబ్ కార్డులకు రూ.86 లక్షల పనిదినాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసి గ్రామ సభలో తీర్మానించామన్నారు. అనంతరం ఎన్ఆర్‌జీఎస్ పనుల నిమిత్తం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, సర్పంచ్ మేడికొండ సునీత, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, ఏపీఓ రత్నజ్యోత్స్న, జేఈ చంద్రశేఖర్, తుమ్మా పుల్లయ్య పాల్గొన్నారు.

పించన్ల పంపిణీ ప్రభుత్వ బాధ్యత



ఈతముక్కలలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఆళ్ళ రవీంద్రరెడ్డి



కరవదిలో నూతన పెన్షన్లు అందజేస్తున్న ఎంపీటీసీ, ఎంపీడీవో, సర్పంచ్

ఒంగోలు రూరల్: సంక్షేమ పథకాల అమల్లో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ఒంగోలు రూరల్ కరవది ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు గురువారం అన్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలో రూ.1000 ఇచ్చిన పెన్షన్‌ను నేడు ముఖ్యమంత్రి రూ.3000 కు పెంచి పంపిణీ చేస్తున్నారన్నారు. సర్పంచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా కార్యదర్శి–1 శ్రీనివాసరావు, కార్యదర్శి–2 వేమా శ్రీలక్ష్మీ ఆయా సచివాలయ కన్వీనర్‌గా వ్యవహరించారు. ప్రతి నెలా రూ.23 లక్షలు కరవది రెండు సచివాలయాల పరిధిలో అందజేస్తున్నామని ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు అన్నారు. పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేసి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారని, కార్పొరేట్ సౌకర్యాలతో నిపుణులైన వైద్యులతో పీహెచ్‌సీ కార్పొరేట్ స్థాయిలో ఉందన్నారు. అదనంగా బాలికల కళాశాల స్థాపించారన్నారు. ఒంగోలు ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ 353 పెన్షన్‌లు నేడు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ కోటేశ్వరావు మాట్లాడుతూ గతంలో ఒక పెన్షన్ పొందాలంటే ఒక పెన్షన్‌దారుడు చనిపోతేనే లభించేదని, జన్మభూమి కమిటీ సభ్యుల ఇంటి వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. కార్యదర్శులు శ్రీనివాసరావు, వేమా శ్రీలక్ష్మి, పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

చేజర్లలో..

సర్పంచ్ చాగంటి రవికుమార్‌రెడ్డి అధ్యక్షతన కార్యదర్శి కె.శ్రీనివాసరావు కన్వీనర్‌గా వ్యవహరించగా ఎంపీడీవో పి.అజిత, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ అందించారు. డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం ఎమ్మెల్యే బాలినేని సహకారంతో పూర్తి చేశామన్నారు.

కొత్తపట్నం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంచలంచలుగా పెంచిన రూ.3 వేల పింఛను ఇవ్వడం అభినందనీయమని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి అన్నారు.

ఈతముక్కల సచివాలయంలో గురువారం పంపిణీ చేశారు. రంగాయపాలెం పంచాయతీలో సర్పంచ్ గాలి స్వరూప ఆధ్వర్యంలో అందించారు. జిల్లా మైనార్టీ కార్యదర్శి, సచివాలయం కన్వీనర్ షేక్ కరిముల్లా, గాలి ముసలారెడ్డి, అజీమ్, వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శి కిరణ్, నితిన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ధ్యేయం



ముక్తినూతలపాడులో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న రాయపాటి అంకయ్య, హెచ్ఎం దేవసేన

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్య రంగానికి ప్రధాన పీట వేస్తోందని వైఎస్సార్ సీపీ నగర పదహారు డివిజన్ కన్వీనర్ రాయపాటి అంకయ్య అన్నారు. ముక్తినూతలపాడు జెడ్పీహైస్కూలు హెచ్ఎం దేవసేన అధ్యక్షతన విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. హెచ్ఎం దేవసేన మాట్లాడుతూ డ్రాప్ అవుట్స్ పూర్తిగా తగ్గిపోయారని తెలిపారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన జంకె



సబ్ కలెక్టర్ రాహుల్‌ను సన్మానిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి గురువారం మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, డీఎస్పీ వీరరాఘవరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సబ్‌కలెక్టర్‌ను మొదటిసారిగా కలిసిన జంకె వెంకటరెడ్డి మార్కాపురం అభివృద్ధికి కృషిచేయాలని, తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, పంబి వెంకటరెడ్డి, మందటి శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, సాంబశివారెడ్డి తదితరులు ఉన్నారు.

పశు వైద్యశాలను సందర్శించిన జేడీ



టీకాల పంపిణీని పరిశీలిస్తున్న డాక్టర్ బేబిరాణి

పొదిలి: స్థానిక పశు వైద్యశాలను పశు సంవర్థక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ బేబిరాణి గురువారం సందర్శించారు. అనంతరం గోశాలలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. టీకాలు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ పి.వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్‌కు రూ.10 లక్షల సామగ్రి అందజేత



వస్తువులను బహూకరిస్తున్న బంగారయ్య, వెంకటేశ్వర్లు

కొత్తపట్నం: స్థానిక సాంఘిక సంక్షేమ సమీకృత బాలికల హాస్టల్‌లో మౌలిక వసతులు, వస్తువు సామగ్రి లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డెన్ ఎన్. అరుణ కుమారి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగంలేకుండా పోయింది. దీంతో మడనూరులో జీవీఆర్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న పిన్ని బంగారయ్య దృష్టికి తీసుకెళ్లగా అయ జీవీఆర్ కంపెనీ అధినేత గ్రంధి వెంకటేశ్వరరావుకు హాస్టల్‌లో ఉన్న వసతుల గురించి వివరించారు. ఆయన మంచి హృదయంతో స్పందించి రూ.10 లక్షలు విలువ చేసే మౌలిక వసతులు, వస్తువుల సామగ్రిని బహూకరించారు. రన్నింగ్ వాటర్ లేక ఇబ్బంది పడుతుంటే రూ.1.79 లక్షలు కేటాయించి కొత్త బోరు, విద్యుత్ మోటర్‌ను ఏర్పాటు చేశారు. బాలికలకు ఆత్మ రక్షణకు హాస్టల్ వైపు రాకుండా రూ.35 వేలతో సీసీ కెమారాలు ఏర్పాటు చేశారు. ఫ్యాన్‌లు 22, రూ.94 వేల వాటర్ హీటర్, 50 మంది విద్యార్థులకు రూ.6.78 లక్షల విలువైన మంచాలు, బెడ్‌లు, రూ.20 వేల ఫిల్టర్ బహూకరించారు.

కరవదికి నూతన కార్యదర్శి నియామకం

ఒంగోలు రూరల్: గత నెల 31 న కరవదిగా కార్యదర్శిగా పనిచేస్తున్న నాగేంద్రకుమార్ పదవీవిరమణ చేయడంతో కొత్తపట్నంలో పనిచేస్తున్న శ్రీనివాసులు కరవది కార్యదర్శిగా నియామకం జరిగింది. ఈ మేరకు బాధ్యతలను ఆయన స్వీకరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్తిస్థాయి అంకితభావంతో నిర్వహిస్తానని తనకు కరవది వంటి మేజర్ గ్రామానికి కార్యదర్శిగా నియమించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయం చైతన్యం కలిగిన కరవది గ్రామంలో విధులు పారదర్శకంగా నిర్వహిస్తానని చెప్పారు.

ఎస్సైగా ఎంపికైన అలేఖ్యకు సత్కారం



అలేఖ్యను అభినందిస్తున్న సాగర్

ఒంగోలు టౌన్: జీవితంలో ఉన్నత స్థానంలోకి చేరుకోవాలన్న పట్టుదలతో ఎస్సైగా ఎంపికైన అలేఖ్య నేటి తరానికి ఒక స్ఫూర్తిగా నిలిచారని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. కొత్త పట్నం పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఎస్సైగా ఎంపికైన అలేఖ్యను గురువారం సత్కరించినట్లు తెలిపారు. బాల్య వివాహాలను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని, స్వచ్ఛంద సంస్థల సహకారం, ఉన్నతాధికారుల ఆదేశాలతో బాలకార్మిక నిర్మూలన కోసం నిరంతరం కృషి చేశారని చెప్పారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూనే సమర్థవంతంగా విధులను నిర్వర్తించారన్నారు. అలేఖ్య కుమార్తెలు అక్సా, హవిలా, వలంటీర్ రేవతి పాల్గొన్నారు.